సాక్షి
గుంటూరు

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



శివాలయానికి రూ.5 లక్షల విరాళం

మంగళగిరి: మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి వైఎస్ఎన్ సీ ఫుడ్స్ ఎండీ సింగంశెట్టి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ మన్నవ సందీప్‌లు రూ. ఐదు లక్షలు విరాళంగా అందజేశారు.



సబ్‌జైలు పరిశీలన

తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్ శనివారం పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, తాగునీటిని తనిఖీ చేశారు.

రూ.4 లక్షలతో అలంకరణ

అద్దంకి రూరల్: అద్దంకిలోని వేయిస్తంభాల దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు రూ.4 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.



● వాత్సల్య రూపిణీ.. కరుణాకరీ..

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాత్సల్య రూపిణి అయిన లలిత త్రిపుర సుందరీదేవిని వేలాది మంది భక్తులు దర్శించుకొని తరించారు. భక్తుల సౌకర్యాలను దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో పాటు ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

– ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)



పోలీస్ అమరవీరుల సేవలు మరువలేం

- కుటుంబ సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తాం
- పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

నగరంపాలెం(గుంటూరువెస్ట్): విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల సేవలు ఎప్పటికీ మరువలేమని, వారు లేని సమాజాన్ని ఊహించలేమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యాన నగరంపాలెంలోని పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద శనివారం పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గతేడాది పది మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని, వారి త్యాగనిరతికి ఘన నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు జిల్లా యంత్రాంగం ద్వారా అవసరమైన సహాయాన్ని అందించేందుకు తొలి ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. ప్రస్తుత కాలంలో పోలీస్ ఉద్యోగం కష్టతరంగా ఉందని, సంఘ వ్యతిరేక శక్తులను ఎదుర్కొంటూ, శాంతి భద్రతల పరిరక్షణే తమ బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నేటి తరంలో పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమని అన్నారు. శాంతి భద్రతలను నెలకొల్పేందుకు రోజుకు 24 గంటలు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఉద్యోగ బాధ్యతల నిర్వహణకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని, వారి కుటుంబానికి తదుపరి ప్రాధాన్యత ఇచ్చి శాంతి భద్రతల పరిరక్షణకు అంకితమవుతున్నారని అన్నారు. పోలీస్ ఉద్యోగం గర్వంగా భావించిన వేలాది మంది యువకులు ఇటీవల జరిగిన ఎస్ఐ ఉద్యోగాలకు ఉత్సాహంగా తరలివచ్చారని గుర్తుచేశారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ మాట్లాడుతూ 1959లో భారత సరిహద్దులో చైనా సైనికులతో జరిగిన పోరాటంలో బీఎస్ఎఫ్ జవానులు 10 మంది వీరమరణం పొందిన విషయాన్ని గుర్తుచేశారు. వారి త్యాగాలను స్మరిస్తూ అప్పటి నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. తీవ్రవాదులు, మతవాదులు, వేర్పాటువాదులతో పోరాడి పోలీసులు అమరులవుతున్నారని తెలిపారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి జ్ఞాపికలు అందించారు. పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. పోలీస్ త్యాగాలను స్మరించుకుంటూ ఏర్పాటుచేసిన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ కేఎస్. లక్ష్మణరావు, జిల్లా ఏఎస్పీ సుప్రజ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో తూర్పు ఏఎస్పీ నాచికేత్ షేల్కే డీఎస్పీలు చంద్రశేఖరరావు (ఏఆర్), ప్రకాష్‌బాబు(క్రైం), బాలసుందరరావు (ట్రాఫిక్), మహబూబ్ బాషా (దక్షిణ), విజయశేఖర్ (ఎస్సీ, ఎస్టీ సెల్), ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం, హైమారావు (నగరంపాలెం పీఎస్), సుబ్బారావు (పాతగుంటూరు పీఎస్), శ్రీనివాసరావు (లాలాపేట పీఎస్), అన్వర్‌బాషా (కొత్తపేట పీఎస్), రామనాయక్ (అరండల్‌పేట పీఎస్), ట్రాఫిక్ సీఐలు కోటేశ్వరరావు (తూర్పు పీఎస్), అక్కేశ్వరరావు (పశ్చిమ పీఎస్), ఆర్ఐలు రాజారావు, థామస్‌రెడ్డి, రాఘవయ్య, పోలీస్ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




పోలీసుల అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఏఎస్పీ కె.సుప్రజ

లలితా త్రిపుర సుందరీదేవిగా బాలచాముండేశ్వరీదేవి



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా శ్రీబాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శనివారం బాలచాముండేశ్వరి అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో ఏడో రోజు లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో బాలచాముండేశ్వరి అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవిఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీ చక్రార్చన పూజకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌కు అవార్డు



సురేష్‌కుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న ప్రభాకరరావు

గుంటూరుఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌ను 2022–23 విద్యాసంవత్సరానికి టాప్ ప్లేస్‌మెంట్ పెర్మార్మర్ అవార్డు వరించింది. ఏఎన్‌యూలో ఈనెల 19న పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి–శిక్షణశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సీహెచ్ నాగరాణి చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ప్రభాకరరావు, ట్రెనింగ్–ప్లేస్‌మెంట్ అధికారి ఆర్.లోకేష్ ఈ అవార్డు అందుకున్నారు. వీరికి శనివారం కళాశాలకు చెందిన అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



మార్కెట్లో దసరా ఆఫర్లు

- ఫర్నిచర్, ఆభరణాలు, వాహన కొనుగోళ్లపై ప్రత్యేక డిస్కౌంట్లు
- ఉచిత బహుమతులతో ఆకర్షిస్తున్న మొబైల్ షాపులు
- కొనుగోలుదారులతో కిటికిటలాడుతున్న దుకాణాలు

పాత గుంటూరు: దసరాకి షోరూం యాజమాన్యాలు కురిపిస్తున్న ఆఫర్లతో గుంటూరుతో పాటు జిల్లాలోని పట్టణాల్లో వస్త్ర దుకాణాలు, ఫర్నిచర్ షాపులు, మొబైల్ షాపులు, బ్రాండెడ్ షోరూంలు, నగల దుకాణాల్లో డిస్కౌంట్ల సందడి నెలకొంది. కార్లు, బైక్‌ల షోరూంలో ఎక్స్ఛేంజ్ మేళాలు, ఆఫర్లు, ప్రత్యేక డిస్కౌంట్లు, విలువైన ప్రత్యేక బహుమతులు, బంపర్ లక్కీడ్రాలు అందిస్తున్నాయి. వస్త్ర కొనుగోళ్లపై 20 నుంచి 50 శాతం వరకు ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తున్నారు. ప్రధానంగా ద్విచక్రవాహన షోరూంలలో పాత వాటిని తీసుకొని కొత్త వాహనాలను అందించడమే కాకుండా ప్రత్యేక రాయితీలు ప్రకటిస్తున్నాయి. ఫర్నిచర్ షాపుల్లో టేబుల్స్, బెడ్స్, సోఫాసెట్లు, గ్రైండర్లు, కుర్చీలు, రిఫ్రిజిరేటర్లు, మైక్రోవేవ్ ఓవెన్‌తో పాటు ఇతర సామగ్రి కొనుగోళ్లలో 25 శాతంకు పైగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు.

పెరిగిన మొబైల్ కొనుగోళ్లు

నగరంలోని బ్రాడీపేట తదితర ప్రాంతంలో మొబైల్ షాపుల్లో స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేసిన వారికి బహుమతులు అందజేస్తున్నారు. హెడ్సెట్, బ్లూటూత్, హోం థియేటర్, పవర్ బ్యాంక్, బ్లూటూత్ హెడ్సెట్ ఇలా ప్రతీ కొనుగోలుపై ప్రత్యేక బహుమతులు అందిస్తున్నారు. దసరా పండగ వరకు కొనుగోలుదారుల్లో పండగ రోజు లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి విలువైన వస్తువులను బహుమతిగా అందించనున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.



గోల్డ్ షోరూంలో కొనుగోలుదారుల సందడి

కొనుగోలు పై ప్రత్యేక డిస్కౌంట్లు

గుంటూరులోని బ్రాడీపేట, లక్ష్మీపురం, పట్నం బజారు, గోల్డ్ షోరూంలలో ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తుండడంతో కొనుగోలుదారులతో సందడి నెలకొంది. బంగారం ధర అధికంగా ఉన్నప్పటికీ షోరూం యాజమాన్యాలు అందిస్తున్న డిస్కౌంట్లతో కొనుగోళ్లు పెరిగాయని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు.

ప్రతీ కొనుగోలుపై విలువైన బహుమతులు



దసరా సందర్భంగా వినియోగదారులకు ప్రతీ బైక్ కొనుగోలుపై రాయితీతోపాటు, ఇన్సూరెన్స్ ప్రత్యేకంగా విలువైన బహుమతులు అందిస్తున్నాం. హోండాకు సంబంధించి అన్ని రకాల వాహనాలు అందు బాటులో ఉన్నాయి. పండుగ సందర్భంగా వినియోగదారుల కోసం ఈ ప్రత్యేక ఆఫర్లు పెట్టాం.

– సుబ్బారెడ్డి, జనరల్ మేనేజర్, సంతోష్ హోండా

బంగారం కొనుగోళ్లు పెరిగాయి



దసరా పురస్కరించుకొని బంగారు ఆభరణాల కొనుగోళ్లు పెరిగాయి. వినియోగదారుల కోసం ఆకర్షణీయమైన ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తున్నాం. కొనుగోలుదారులకు నచ్చే విధంగా వెరైటీ మోడల్స్‌ను అందుబాటులో ఉంచాము. సాధారణ రోజుల కన్నా దసరా పండుగ రోజుల్లో గోల్డ్ వ్యాపారం ఊపందుకుంది.

– వి. భీమ్ జీ, మేనేజర్, గోల్డ్‌షోరూమ్

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

- రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశం



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే ఎం.సుచరిత, మక్కెన, బత్తుల, తదితరులు

గుంటూరురూరల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల ఇంటివద్దకే అందించారని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి తెలిపారు. శనివారం వై జంక్షన్ సమీపంలోని ఓ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే విషయంపై ప్రత్తిపాడు నియోజకవర్గం స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అధ్యక్షత వహించారు. ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. పార్టీలు, కులమతాలకతీతంగా నవరత్నాల పథకాలను ప్రతిఇంటికీ అందించారన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లిస్తేనే పథకాలు అందేవని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో ప్రజలు ఇబ్బందులు పడిన వైనం, జగనన్న పాలనలో ప్రజలు సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్న వైనాన్ని బేరీజు వేసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి నేడు ఆర్థిక చేయూత లభించిందని చెప్పారు. భారతదేశ చరిత్రలో ఏ రాజకీయపార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మ్యానిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కానీ నేడు జగనన్న 99 శాతం అమలు చేసి చూపించాడన్నారు. మహిళా సాధికారతకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఏకైక నాయకుడు మన జగనన్న అని తెలిపారు. రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ నేడు ప్రతి సంక్షేమ పథకం సొమ్ము నేరుగా లబ్ధిదారుల అకౌంట్‌లో చేరుతున్నాయని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. గ్రామంలోనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని చేపట్టటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి మన జగనన్న అని తెలిపారు. అటువంటి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మనమంతా సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు నియోజకవర్గం పరిశీలకుడు మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, తాడికొండ నియోజకవర్గం పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డిలు జగనన్న అందించిన నవరత్నాల పథకాలు సంక్షేమం గురించి వివరించారు. కార్యక్రమంలో ఐదు మండలాల కన్వీనర్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, కార్పొరేటర్లు, జేసీఎస్ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

స్పెషల్ లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

పట్నంబజారు: జిల్లా ఒకటవ అదనపు జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.హెచ్.రాజగోపాల్‌రావు ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా కోర్టు ప్రాంగణంలో స్పెషల్ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన స్పెషల్ లోక్ అదాలత్‌లో భాగంగా ఎల్ఏఏపీ, ఎంవీఓపీ కేసులను పరిష్కరించారు. కేసుల పరిష్కారంలో భాగంగా బాధితులకు రూ 6కోట్ల,10లక్షల48 అందేలా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 86 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోకఅదాలత్‌కు సహకరించిన న్యాయాధికారులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్, పోలీసు సిబ్బందికి, కక్షిదారులకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జీ, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ. అనిత ధన్యవాదాలు తెలిపారు.

తిమ్మాపురం హైవేపై ప్రమాదం

యడ్లపాడు: తిమ్మాపురం హైవేను దాటుతున్న ఇద్దరు కార్మికులను బైక్ ఢీకొంది. అదే సమయంలో వేగంగా వచ్చిన కారు రోడ్డుపై పడిన ఒకరిపై దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశాకు చెందిన సత్యజిత్‌సాహు, తూర్పుగోదావరి జిల్లా పాడేరుకు చెందిన నూకరాజు ఇద్దరు తిమ్మాపురంలోని మంజునాథ(24) నూలుమిల్లులో పనిచేసే వలస కార్మికులు. శుక్రవారం తమ వ్యక్తిగత పనులను చూసుకుని గ్రామంలోని 16వ నంబర్‌హైవేను దాటుతున్నారు. ఈ క్రమంలో బెంగళూరు నుంచి రాజమండ్రికి రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై వెళ్తున్న వెంకటసూర్య బైక్ వీరిని ఢీకొంది. కార్మికులతో పాటు బైక్‌పై ఉన్న వెంకటసూర్య కూడా హైవేపై పడిపోయాడు. దీంతో ముగ్గురికీ గాయాలయ్యాయి. సరిగ్గా అప్పుడే ఆ మార్గాన వేగంగా దూసుకువచ్చిన కారు నూకరాజుపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భవనం టెక్స్‌టైల్స్ సమీపంలో నెలకొన్న ఈ ఘటన సమాచారం స్థానికుల ద్వారా అందుకున్న 108 వాహన సిబ్బంది ఈఎన్‌టీ శోభన్‌బాబు, పైలెట్ శివనాగాంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. మృతదేహాన్ని పోలీసులు చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కోతలపై తప్పుడు రాతలు

నకరికల్లు: ప్రభుత్వంపై, విద్యుత్‌శాఖ పనితీరుపై బురదజల్లడానికి తప్పుడు విద్యుత్‌కోతలు అన్న వార్తల్లో వాస్తవం లేదని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండలంలోని శివాపురంతండాలో లక్‌పతినాయక్ అనే రైతు పొలం వ్యవసాయ విద్యుత్‌కోతల వల్లే ఎండిపోయిందని కరెంటు ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఓ దినపత్రిక(సాక్షి కాదు)లో వచ్చిన కథనం మేరకు శనివారం శివాపురంతండాకు వెళ్లి పొలాలను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు.

విజ్ఞాన్‌లో ఘనంగా దాండియా ఉత్సవాలు



బోనాలు ఆడుతున్న విద్యార్థినీ విద్యార్థులు



మాట్లాడుతున్న విజ్ఞాన్ ఛైర్మన్ రత్తయ్య

చేబ్రోలు: మండల పరిధి లోని వడ్లమూడిలోగల విజ్ఞాన్ వర్సిటీలో దసరా పండుగను పురస్కరించుకుని విద్యార్థులు దాండియా, బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ నవరాత్రి అంటే కేవలం తొమ్మిది రోజులు చేసుకునే ఉత్సవం కాదని... స్త్రీతత్వం తాలూకు మూడు పరిమాణాలైన దుర్గ, లక్ష్మి, సరస్వతిగా కొలిచే ఉత్సవమన్నారు. అమ్మవారిని పూజిస్తే సిరిసంపదలు సిద్ధించడంతో పాటు సుఖసంతోషాలు కలుగుతాయని చెప్పారు. ఆడపిల్లలు సల్లంగ బతకాలని కోరుతూ బతుకమ్మ పండుగకు ఆడపడుచులు ఊపిరిపోశారని విద్యార్థులకు తెలియజేసారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



మంగళగిరి: నగరంలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ ఆవరణలో శనివారం పోలీసు అమరవీరుల దినం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసు సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఈఎస్ సాయిప్రసాద్, దేవానంద్, డీఎస్పీ మురళీకృష్ణ పాల్గొన్నారు. పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్‌లలో అమరవీరుల దినం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐలు మహేంద్ర, కోటేశ్వరరావు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.